క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చిట్యాల : చిట్యాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. జోగు అశోక్, తాడూరి చంద్రం, రాచకొండ గోపి, చికిలంమెట్ల మోహన్‌బాబు, రామచారి, లింగస్వామి పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన అవిశెట్టి రజిత తండ్రి ముత్యాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమెతో కలిసి చదువుకున్న జెడ్పీహెచ్ఎస్ 2007–08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, స్వస్తిక్ యూత్ పేరుతో పది వేల రూపాయలను సేకరించిన మంగళవారం ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అంతటి నరేందర్, పోల సైదిరెడ్డి, కోరబోయిన వేణు, అంతటి వెంకన్న, అవిశెట్టి మల్లేష్, మేడి రమేష్, మర్రి కిరణ్, సాగర్ల శేఖర్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



బహుమతి అందిస్తున్న మహమ్మద్ వహీద్

మర్రిగూడ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని కుదభాక్షపల్లి గ్రామంలో వైఎస్ఆర్‌టీపీ మండల అధ్యక్షుడు మహమ్మద్ వహీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలైన మాదగోని శ్రీశైలం, బుచ్చాల దిలీప్ టీంలకు మహమ్మద్ వహీద్ బహుమతులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును రామస్వామి సాయికుమార్ అందుకున్నారు.

19న సింహగర్జన సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్ : విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న నల్లగొండ పట్టణంలో నిర్వహించే సింహగర్జన సభను విజయవంతం చేయాలని విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో సింహగర్జన పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరి నారాయణయాదవ్, సైదులు, వెంకటేశం, మల్లేష్‌యాదవ్, కారింగు నరేష్‌గౌడ్, రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

కేతేపల్లి : వరిలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు వేయాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం అన్నారు. మంగళవారం మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో రైతులు సాగు చేసిన యాసంగి వరి పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. అనంతరం ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏఈఓ వీరేష్, రైతులు వినోద్, రామలింగయ్య, రాములు, జానయ్య పాల్గొన్నారు.

ఖమ్మం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ చినవెంకట్‌రెడ్డి

చిట్యాల : ఖమ్మంలో బుధవారం జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి కోరారు. చిట్యాలలో మంగళవారం పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, వనమా వెంకటేశ్వర్లు, గుండెబోయిన సైదులు, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, జిట్ట బొందయ్య, సిలివేరు శేఖర్, యాదయ్య పాల్గొన్నారు.

శాలిగౌరారం : బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న కోరారు. మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేందర్‌రెడ్డి, శేఖర్‌బాబు, వీరయ్య, పుల్లయ్య, ధనుంజయ్య, వెంకన్న, శ్రీనివాసులు, వీరబాబు, గణేశ్, వీరసోములు పాల్గొన్నారు.

వాకింగ్‌కు సర్వీస్ రోడ్డే దిక్కు !



సర్వీస్ రోడ్డు వెంట ఉన్న మట్టి రోడ్డుపై వాకింగ్ చేస్తున్న నార్కట్‌పల్లి ప్రజలు



సర్వీస్ రోడ్డుపైనే వ్యాయామం చేస్తున్న ప్రజలు

- సర్వీస్ రోడ్డుపైనే వాకింగ్, వ్యాయామం
- స్థలం లేక ఇబ్బందులు పడుతున్న నార్కట్‌పల్లి వాసులు

నార్కట్‌పల్లి : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసింది. అయితే నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో క్రీడా ప్రాంగణం నేటికీ ఏర్పాటు కాలేదు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే నార్కట్‌పల్లిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం లేదని మండల కేంద్రంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్లపైనే వాకింగ్

నార్కట్‌పల్లిలో క్రీడా మైదానం లేకపోవడంతో ఉదయం పూట వాకింగ్, వ్యాయామం చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్డుపై వాకింగ్, వ్యాయామం చేస్తున్నారు. రోడ్డుమీదనే వ్యాయామం, వాకింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు పరిశీలించి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడా మైదానం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం స్థలం గుర్తించి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పైనే వ్యాయామం చేస్తున్నాం



ప్రతి గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మా గ్రామ పంచాయతీలో మాత్రం నేటికీ అమలుచేయడం లేదు. ప్రత్యేక మైదానం లేకపోవడంతో రోడ్డుపైనే వ్యాయామం చేస్తున్నాం. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని నార్కట్‌పల్లిలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి,

–లోకసాని శేఖర్‌రెడ్డి, నార్కట్‌పల్లి

అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు



అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే క్రీడా మైదానం ఏర్పాటు కావడం లేదు. వాకింగ్, వ్యాయామం చేయడానికి ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపై వాకింగ్ చేయాల్సి వస్తోంది. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేశాం. క్రీడామైదానం ఏర్పాటు విషయంలో వారు చొరవ చూపాలి.

– పనునూరి శ్రీను, నార్కట్‌పల్లి

భయంభయంగా వాకింగ్ చేస్తున్నాం



ప్రత్యేక క్రీడా మైదానం లేకపోవడంతో నల్లగొండ రోడ్డు నుంచి కామినేని సర్వీస్ రోడ్డు వరకు రోడ్డుపై నార్కట్‌పల్లి ప్రజలు వాకింగ్ చేస్తున్నారు. వాహనాల వస్తుంటే భయంభయంగా వాకింగ్ చేస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నార్కట్‌పల్లిలో వాకింగ్ చేయడానికి ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలి.

– మార్క నారాయణ, ఆర్ఎంపీ

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం అని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వీటీ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 303 మందికి రూ.కోటి 35 లక్షల 65 వేల 700 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా మాడ్గులపల్లి మండలానికి చెందిన 14 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే నల్లగొండ నియోజకవర్గానికి చెందిన వారికి అత్యధికంగా సీఎం సహాయ నిధి మంజూరు చేయించామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి ఎంపీపీ విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్, అభిమన్యు శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాద్రీ, నాయకులు నిరంజన్‌వలీ, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీం, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధి కమిటీ ఎన్నిక

పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియం అభివృద్ధి కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడిగా నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, అధ్యక్షుడిగా బొమ్మపాల గిరిబాబు, గౌరవ సలహాదారులుగా డాక్టర్ సీహెచ్. పుల్లారావు, గోట్టిపాటి కర్తయ్య, యానాల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఇమామ్ కరీం, ప్రధాన కార్యదర్శిగా షేక్ రహీం, కోశాధికారిగా బాగిడి అర్జున్, సహాయ కార్యదర్శులుగా మద్ది కరుణాకర్, అంబటి ప్రణీత్, బోయ మధు, రాచూరి గణేశ్, షరీఫ్, జీవన్, సుందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బొమ్మపాల శంకర్, తాజుద్దీన్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కంచర్లను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జూనియర్ లెక్చరర్ల క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లగొండ : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ ప్రధానాచార్యుల సంఘం జిల్లా క్యాండర్‌ను నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్య జేఏసీ అధ్యక్షుడు హేమ్లనాయక్, కార్యదర్శి నాగిరెడ్డి శిల్ప, ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు భానునాయక్ కార్యదర్శి ధన్‌రాజ్, జూనియర్ లెక్చరర్ల రాష్ట్ర కార్యదర్శి శింగం శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సంభ్యులు కేపీఎం కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, గోపాల్‌రెడ్డి, గట్టుపల్లి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



ఇందిరమ్మ కాలనీలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఇటీవల నిర్మాణం చేపట్టిన డ్రెయినేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బంగారు తెలంగాణే లక్ష్యంగా కేసీఆర్ పరిపాలన కొనసాగుతోందన్నారు. త్వరితగతిన డ్రెయినేజీ పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో సీసీ రోడ్లు నిర్మించేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, ఉప సర్పంచ్ అంతటి శ్రీనివాస్, పీఆర్ ఏఈ జమీలుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు బొల్లెద్దు యాదయ్య, వార్డు సభ్యులు రెడ్డిపల్లి మనోహర్, అంతటి నాగమణినాగేష్, పోగుల అంజయ్య, బత్తిని నర్సింహ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తా

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



తమ్మడపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ : నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో సీసీ రోడ్ల పనులకు, తిరగండ్లపల్లి గ్రామంలో రూ.40 లక్షలు, అజ్జిలాపురం గ్రామంలో రూ.40 లక్షలు, యరగండ్లపల్లిలో రూ.40 లక్షలు, కొండూరులో రూ.40 లక్షలు, మర్రిగూడలో రూ.60 లక్షలు, రాజాపేటతండాలో రూ.40 లక్షలు, వట్టిపల్లిలో రూ.60 లక్షలు, భీమనపల్లిలో రూ.40 లక్షలు, కమ్మగూడలో రూ.40 లక్షలు మొత్తం రూ.4.40 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దీవెనలతో మునుగోడుకు అధిక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఎంపీపీ మెందు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, మునగాల వెంకటేశ్వర్‌రావు, బచ్చు రామకృష్ణ, కొలుకుల యాదయ్య, పందుల రాములుగౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని, కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 19న గ్రామపంచాయతీ కార్మికులు హైదరాబాద్ వరకు తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య, ఏర్పుల యాదయ్య, పోలె సత్యనారాయణ, ఎన్.నర్సింహ, పి.అంజయ్య, ఆశీర్వాదం, సర్వయ్య, ఏర్పుల సైదులు, రెడ్డిమల్ల యాదగిరి, అండాలు, రామలింగయ్య, సైదులు, హనుమంతు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నకిరేకల్ : సీఎం సహాయ నిధి ద్వారా నకిరేకల్ మండలం, పట్టణంలోని 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.6లక్షల విలువ గల చెక్కులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జెడ్పీటీసీసీ మాద ధనలక్ష్మీనగేష్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, రైతు, దళిత బంధు కోఆర్డినేటర్లు సామ శ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేషం తదితరులు పాల్గొన్నారు.


ఇసుక అక్రమ రవాణా నిరోధించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వాహనదారులు

శాలిగౌరారం : మండలంలోని మూసీనది నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని డిమాండ్ చేస్తూ శాండ్‌ట్యాక్సీ వాహనదారులు మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శాలిగౌరారం–నకిరేకల్ ప్రధానరోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శాండ్ ట్యాక్సీ వాహన యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మండలంలోని వంగమర్తి, చిత్తలూరు గ్రామాల సరిహద్దులోని మూసీనది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంతో ఆన్‌లైన్‌లో ఇసుకకు సంబంధించిన బుకింగ్‌లు కాక శాండ్‌ట్యాక్సీ రీచ్‌లు నడవడం లేదన్నారు. దీంతో శాండ్‌ట్యాక్సీని నమ్ముకుని లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు ఫైనాన్స్ చెల్లించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. మూసీ నది నుంచి నిత్యం జోరుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను మండల రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరోధించాలని కోరారు. సుమారు గంటన్నరకు పైగా రోడ్డుపై రాస్తారోకో కొనసాగడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ రాస్తారోకో వద్దకు చేరుకుని వాహనదారులతో మాట్లాడి ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం శాండ్‌టాక్సీ వాహనదారులు ఎస్ఐతోపాటు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. మనిమద్దె, గురుజాల, తుడిమిడి గ్రామాలకు చెందిన సుమారు 200 మంది శాండ్‌టాక్సీ వాహనదారులు రాస్తారోకోలో పాల్గొన్నారు.

ప్రజాసంఘాలను బలోపేతం చేయాలి



తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో సభ్యత్వం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

చిట్యాల : ప్రజాసంఘాల బలోపేతానికి ప్రజలంతా సహకరించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అన్నారు. వెలిమినేడు గ్రామంలో ప్రజా సంఘాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంఘాలు బలహీనపడడంతో పాలక పక్షాలు.. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐత రాజు నర్సింహ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, లడే రాములు, నెల్లికంటి నర్సింహ, శంభయ్య, అవిశెట్టి నర్సింహ, రాంరెడ్డి పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ) : కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, 50 సంవత్సరాలు నిండిన రైతులందరికీ నెలకు రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నన్నూరి వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ పంచాయతీలో ప్రజా సంఘాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మన్నెం భిక్షం, గండమళ్ళ రాములు, సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేశ్, సైదులు, సింహాద్రి, చిన్న రాములు, శంకర్, చిన్న లింగయ్య, పరమేష్, అంజయ్య, మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఉచిత వైద్య పరీక్షలు

శాలిగౌరారం : మండలంలోని శాలిలింగోటంలో శాలిగౌరారంకు చెందిన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పాక మౌనిక యాదయ్య, లయన్స్‌క్లబ్ శాలిగౌరారం అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దునుక వెంకన్న, ప్రతినిధులు దామెర్ల శ్రీనివాస్, రామడుగు వెంకటరామశర్మ, బల్లెం ప్రణయ్, వార్డు సభ్యులు బండారు జయమ్మ, అర్రూరి నాగమ్మ, బండారు శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గుంతలు పూడ్చివేత



గుంతను పూడ్చివేయిస్తున్న స్థానికులు

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల : పట్టణ శివారులోని శ్రీ బాలనర్సింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఇటీవల కొందరు గుంతలు తవ్వడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఈ నెల 16వ తేదీ(మంగళవారం)న సాక్షి దినపత్రికలో 'ఆలయానికి నిలిచిపోయిన రాకపోకలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఆలయానికి వెళ్లే దారికి అడ్డుగా తీసిన గుంతలను స్థానికులు మంగళవారం జేసీబీలతో పూడ్చివేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దిన పత్రికకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



నకిరేకల్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్



కేతేపల్లి : కొర్లపహాడ్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ రంజిత్

నకిరేకల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కంటి వెలుగు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కంటి వెలుగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, డీఈ సునతీశర్మ, వైద్యసిబ్బంది నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బుధవారం నుంచి చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మండల స్పెషల్ ఆఫీసర్ రంజిత్ కోరారు. కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం మండలంలోని కొర్లపహాడ్, కేతేపల్లి గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన అవగాహన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు కొనసాగించాలన్నారు. కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. శిబిరాలకు తప్పనిసరిగా ఆధార్‌కార్డు వెంట తెచ్చుకునేలా తెలియజేయాలన్నారు సమావేశంలో తహసీల్దారు డి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, ఎంపీఓ భాగ్యమతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ టూటౌన్ : కంటి వెలుగు కార్యక్రమం కోసం ఆయా వార్డుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వీ. రమణాచారి తెలిపారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో పర్యటించి కంటి వెలుగు కేంద్రాల్లో వసతులు, ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి పరీక్షల కోసం కేంద్రాలకు వచ్చే ప్రజల కోసం తాగునీటి వసతి, టాయిలెట్స్, విద్యుత్ తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌన్సిలర్ సమి, డీఈ రాములు, ఏఈ రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్, జి. శ్రీనివాస్, మెప్మా సీఓ జ్యోతి, పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యోగస్వీ తెలిపారు. మంగళవారం స్థానిక ఓగోడు ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. గురువారం నుంచి ఓగోడు, చందంపల్లిలో రెండు టీంలు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఆధునిక యంత్రం ద్వారా కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైద్యసిబ్బంది సుకన్య, రాపోలు రవి, నర్సింహాచారి, శ్యాం, వెంకన్న, సుజన తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మండల ప్రత్యేక అధికారి, శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా బుధవారం నుంచి చేపట్టనున్న కంటివెలుగు కార్యక్రమంపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతోపాటు, అవసరమైనవారికి కళ్లద్దాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. మొదటగా మండలంలోని ఆకారం, జాలోనిగూడెంలలో కంటివెలుగు క్యాంపులు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య, మండల వైద్యాధికారి వెంకన్న, ఎంపీఓ సుధాకర్, ఏపీఎం జానకి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

మైక్రో ఆర్ట్‌లో రాణిస్తున్న శ్రీజ

- వినూత్న రీతిలో ఆర్ట్ వేస్తున్న కళాకారిణి
- పెన్సిళ్లు, చాక్‌పీస్‌లపై చిత్రాలు



విద్యార్థిని శ్రీజ వేసిన మైక్రో ఆర్ట్‌లు



చాక్ పీస్‌పై వేసిన మైక్రో ఆర్ట్

రామగిరి(నల్లగొండ) : కళాకారులుగా మారడానికి చాలా ప్రతిభ అవసరం. ఓర్పు, ధృఢ సంకల్పం కలిగినవారు మాత్రమే విభిన్న కళల్లో రాణిస్తారు. అటువంటి ఓ విభిన్న కళను ఎంచుకున్న కళాకారిణి నల్లగొండ పట్టణానికి చెందిన శ్రీజ. పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న శ్రీజ ప్రస్తుతం ఎన్జీ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతోంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఏదో ఒకటి చేయాలనే ఉత్సుకతతో మైక్రో ఆర్ట్‌ను ఎంచుకుంది. పట్టుదలతో తాను ఎంచుకున్న కళలో ప్రావీణ్యం సాధించింది. ఒకవైపు డిగ్రీ చదువుతూనే ఇంకోవైపు మైక్రో ఆర్ట్ వేయడం ప్రారంభించింది. ఖాళీ సమయంలో ఏకలవ్యుడిలాగా తానే సొంతంగా మైక్రో ఆర్ట్ నేర్చుకుంది. వైవిధ్యమైన చిత్రాలను వేస్తూ అందరి మన్ననలు పొందుతోంది. పెన్సిల్స్, చాక్‌పీస్, అగ్గి పుల్లలు, బియ్యం గింజలు, క్యాండిల్స్ ఇలా అనేక వాటిపై విభిన్నమైన రీతిలో ఆర్ట్ వేసింది. తన అద్భుతమైన ప్రతిభతో పేపర్, ఆకులు, కుండ పెంకులు, కోడి గుడ్డు, ట్యాబ్లెట్లపై వివిధ సందేశాలను తెలుపుతూ చిత్రాలు వేస్తోంది. కుటుంబ సభ్యుల సహకారంతో మైక్రో ఆర్ట్ కళను కొనసాగిస్తున్నానని శ్రీజ తెలిపింది.

మైక్రో ఆర్ట్‌లో జిల్లాకు గుర్తింపు తీసుకొస్తా..



ఇప్పటివరకు చాలామంది మైక్రో ఆర్ట్ వేశారు. వారికి విభిన్నంగా వర్తమాన అంశాల ఆధారంగా నేను ఆర్ట్‌లు వేస్తున్నాను. ఇప్పటివరకు 300 వరకు మైక్రో ఆర్ట్‌లు వేశా. అదేవిధంగా పెయింటింగ్ కూడా వేస్తా. శిక్షణ తీసుకోకుండా స్వతహాగా నేర్చుకున్నా. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో మైక్రో ఆర్ట్‌లో రాణిస్తున్నా. మైక్రో ఆర్ట్‌లో జిల్లాకు, కుటుంబ సభ్యులకు గుర్తింపు తీసుకొస్తా.

– గద్దం శ్రీజ